





# వచ్చినకాడికే అమ్మేద్దాం..

**ప్రభుత్వ రంగ సంస్థలను బలవంతంగా విక్రయిస్తున్న కేంద్ర ప్రభుత్వం**

**దేశంలోని బడా కార్పొరేట్లకు లాభం చేకూరుతున్నదన్న విమర్శలు**

**పెట్టుబడుల ఉపసంహరణ విఫలమవుతున్నా మొండిగా ముందుకెళ్తున్న మోదీ సర్కారు**

## ఈ ఆర్థిక సంవత్సరం డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యంలో ఇప్పటిదాకా 15 శాతానికే పరిమితం

*కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తీరు.. ప్రభుత్వ రంగ సంస్థల పాలిట శాపంలా మారింది.*

**నిధుల సమీకరణే లక్ష్యంగా ఎన్నో పీఎస్‌యూల ఉసురు తీసేస్తున్నారు మరి. ఇది.. తమవారని చెప్పుకునే కార్పొరేట్లకు అడ్డగోలుగా లాభిస్తున్నది.**

*ఆ రంగం.. ఈ రంగం.. అన్న తేడా లేకుండా అన్ని రంగాల్లోనూ ప్రభుత్వ సంస్థల్లో వాటాల ఉపసంహరణకు కేంద్రం తెగబడుతున్నది. దీనివల్ల కొన్ని రంగాల్లో ప్రభుత్వ ఉనికే లేకుండా పోతున్నదిప్పుడు.*

**మొదట్నుంచీ** ప్రైవేటీకరణకు పెద్దపీట వేస్తున్న మోదీ సర్కారు.. ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో పెట్టుబడుల ఉపసంహరణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. ఈ క్రమంలోనే తొలి ఐదేండ్ల పాలనలో సుమారు రూ.3 లక్షల కోట్లను అందుకున్న కేంద్రం.. మలి దశ పాలనలో దాదాపు రూ.1.5 లక్షల కోట్లను పొందింది. అయితే రాన్రాను పీఎస్‌యూలపట్ల కొనుగోలుదారులకు ఆసక్తి తగ్గుతున్నా.. వచ్చినకాడికే అమ్మేద్దాం అనేలా ఉంటున్న కేంద్ర ప్రభుత్వ తీరు ఇప్పుడు సర్వత్రా విమర్శలకు దారితీస్తున్నది. ఏండ్ల తరబడి చేసిన కష్టంతో బలమైన సంస్థలుగా ఎదిగిన వాటిని అడ్డగోలు ధరలకే కార్పొరేట్లకు అమ్ముతుండటం.. జాతి సంపదకు ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**అన్నీ వైఫల్యాలే..**

ఎయిరిండియా ప్రైవేటీకరణ, బీఎస్‌ఎన్‌ఎల్-ఎంటీఎన్‌ఎల్ నష్టాలు, ఐడీబీఐ బ్యాంక్ వాటా అమ్మకం, అదానీ కంపెనీల్లో ఎల్‌ఐసీ పెట్టుబడులు, ప్రభుత్వ బ్యాంకుల విలీనాలు, సర్కారీ సాయం లేక మూతబడుతున్న సంస్థలు.. ఇలా చెప్పుకుంటూపోతే ఇంకెన్నో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు దర్శనమిస్తాయని మెజారిటీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. డివిడెండ్ల కోసం పీఎస్‌యూలపై ఒత్తిడి తెస్తున్న కేంద్రం.. ఆర్బీఐ మిగులు నిధులపైనా కన్నేయడం పెద్ద దుమారాన్నే రేపిన విషయం తెలిసిందే. ఇక ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీల దోస్తీపై, అదానీ కంపెనీల్లో ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్‌ఐసీ భారీగా పెట్టిన పెట్టుబడులు, విదేశాల్లో అదానీ ఒప్పందాల వెనుక కేంద్రం సాయం ఉందన్న దానిపై పార్లమెంట్‌లో జరిగిన రచ్చ కూడా విదితమే.

**మోదీ సర్కారు హయాంలో పీఎస్‌యూల్లో వాటాల అమ్మకం**

(రూ.కోట్లలో)

| ఆర్థిక సంవత్సరం | పెట్టుబడుల ఉపసంహరణ |
|---|---|
| 2014-15 | 24,349 |
| 2015-16 | 23,997 |
| 2016-17 | 46,247 |
| 2017-18 | 1,00,057 |
| 2018-19 | 84,972 |
| 2019-20 | 50,300 |
| 2020-21 | 32,886 |
| 2021-22 | 13,534 |
| 2022-23 | 35,294 |
| 2023-24 | 8,000 (ఇప్పటిదాకా) |

**రూ.51,000 కోట్లకు..**

ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) ప్రభుత్వ రంగ సంస్థల్లో రూ.51,000 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే ఇప్పటిదాకా రూ.8,000 కోట్లనే సాధించగలిగింది. కార్పొరేట్లలో పీఎస్‌యూలపట్ల తగ్గిన ఆసక్తే ఇందుకు కారణంగా చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో ఎన్‌ఎండీసీ స్టీల్, హిందుస్థాన్ జింక్, ఐడీబీఐ వాటాల విక్రయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కష్టమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎన్‌ఎండీసీలో ప్రభుత్వానికున్న 50.79 శాతం వాటా విక్రయాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇక ఐడీబీఐ ప్రైవేటీకరణకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిబంధనలు అడ్డొస్తున్నాయి. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం తగ్గిపోవచ్చునీ అంటున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం షిప్పింగ్ కార్పొరేషన్, కాంకర్ వాటాల విక్రయంపైనే ఆశలు పెట్టుకున్నది మరి. నిజానికి గత ఆర్థిక సంవత్సరం (2022-23) కూడా రూ.65,000 కోట్లకు రూ.35,293 కోట్లే పీఎస్‌యూల్లో వాటాల అమ్మకం ద్వారా వచ్చాయి. చివరిసారిగా 2018-19లోనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరింది. అప్పుడు రూ.80,000 కోట్లకు రూ.84,972 కోట్లను అందుకున్నది. మరోవైపు ఈ ఆర్థిక సంవత్సరం డివిడెండ్ల రూపంలో పీఎస్‌యూల నుంచి రూ.43,000 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో మోదీ సర్కారు అంచనా వేసింది. కానీ రూ.19,390 కోట్లే వచ్చాయి.

– బిజినెస్ డెస్క్

- 2014-19 మధ్య ఐదేండ్ల తొలి పాలనలో ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులను ఉపసంహరించి రూ.2,79,622 కోట్లను అందుకున్న మోదీ సర్కారు
- 2019-24లో ఐదేండ్ల మలి పాలనలో సర్కారీ కంపెనీల్లో వాటాలను అమ్ముకుని రూ.1,40,014 కోట్లు పొందిన కేంద్రం
- కేంద్రంలో అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి ఆయా ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా అమ్మేసో లేక వాటిల్లో కొంత మేర వాటాలను విక్రయించో ఇప్పటిదాకా మొత్తం రూ.4,19,636 కోట్లను బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం దక్కించుకున్నది
- ఎయిరిండియాను బలవంతంగా టాటాలకు అప్పజెప్పిన నరేంద్ర మోదీ ప్రభుత్వం. ఐడీబీఐ బ్యాంక్‌నూ ప్రైవేట్ పరం చేస్తున్న వైనం
- మోదీ హయాంలో 27 నుంచి 12కు తగ్గిన ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్య. స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌సహా 15 బ్యాంకులు ఇతర బ్యాంకుల్లో విలీనం



# ఆర్‌జీఐ మరింత విస్తరణ

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానాశ్రయాల్లో ఒకటిగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నిలిచింది. ఈ నేపథ్యంలో పెరుగుతున్న ప్రయాణికుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని చేపట్టిన మొదటి దశ విస్తరణ పనులు వేగంగా పూర్తయ్యాయి. తూర్పు భాగంలో చేపట్టిన విమానాశ్రయ విస్తరణ పనులు పూర్తి కావడంతో శుక్రవారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చామని విమానాశ్రయ ఉన్నతాధికారులు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో దానికి అనుగుణంగానే విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు.

**అత్యాధునిక వసతులతో లాంజ్..**

విమానాశ్రయంలో ప్రయాణికుల రాకపోకలకు వీలుగా కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన లాంజ్‌ను 6.07 లక్షల చ.అ. విస్తీర్ణంలో అత్యంత మెరుగైన మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 23.4 లక్షల చదరపు అడుగులు ఉండగా, కొత్తగా అందుబాటులోకి వచ్చిన దాంతో మొత్తం 29.50 లక్షల చదరపు అడుగుల్లో టర్మినల్ ఉంటుందని తెలిపారు. కొత్తగా నిర్మించిన తూర్పు ప్రాంతంలో 22 ఎస్కలేటర్లు, 22 ఎలివేటర్లు, పురుషులకు, మహిళలకు 9 చొప్పున విశ్రాంతి గదులు ఉన్నాయి.




# హైదరాబాద్ నుంచి కొలంబో డైరెక్ట్ ఫ్లైట్

శంషాబాద్ రూరల్, నవంబర్ 3 : హైదరాబాద్ నుంచి కొలంబో ఎయిర్‌పోర్టుకు డైరెక్ట్ విమాన సర్వీస్‌ను ఇండిగో ఎయిర్‌లైన్స్ శుక్రవారం ప్రారంభించింది. ఉదయం 11.50 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సంబంధిత అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మధ్యాహ్నం 2 గంటలకు కొలంబోకు చేరుకుంది.


# సిగ్నిటీ మధ్యంతర డివిడెండ్ రూ.3

హైదరాబాద్, నవంబర్ 3: ఐటీ సేవలు అందిస్తున్న సిగ్నిటీ టెక్నాలజీ అంచనాలకు మించి రాణించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.451.83 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.45.86 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన ఆదాయంతో పోలిస్తే 8 శాతం వృద్ధి చెందగా, నికర లాభంలో 10 శాతం పెరుగుదల కనిపించింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో శ్రీకాంత్ చకిలం మాట్లాడుతూ..ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు నిరాశాజనకంగా ఉన్నప్పటికీ ఆదాయ, లాభాల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేసుకున్నట్టు తెలిపారు. ఈ ఏడాదికిగాను సంస్థ రూ.3 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.

## యూకో బ్యాంక్ ప్రాఫిట్ డౌన్

కోల్‌కతా, నవంబర్ 3: యూకో బ్యాంక్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.402 కోట్ల లాభాన్ని గడించింది. క్రితం ఏడాది నమోదైన రూ.505 కోట్ల కంటే ఇది 20.39 శాతం తక్కువ. అలాగే ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.982 కోట్లకు పరిమితమైంది.

# పీఎన్‌బీ పండుగ బొనాంజా



హైదరాబాద్, నవంబర్ 3: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) పండుగ బొనాంజాను ప్రకటించింది. 'దీపావళి ధమాకా 2023' పేరుతో ప్రకటించిన ప్రత్యేక ఆఫర్ కింద 8.40 శాతం వడ్డీకే గృహ రుణం, 8.75 శాతం వడ్డీకే వాహన రుణాన్ని అందిస్తున్నది. ఈ రెండు రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంటేషన్ చార్జీలను పూర్తిగా ఎత్తివేసింది. మరింత సమాచారం కోసం 18001800/18002021 కాల్ చేసి లేదా దగ్గర్లో ఉన్న పీఎన్‌బీ శాఖను సంప్రదించి పూర్తి సమాచారం తెలుసుకోవచ్చునని సూచించింది.

# రెండు బ్యాంక్‌లకు ఆర్బీఐ షాక్

ముంబై, నవంబర్ 3: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తోపాటు మూడు ప్రైవేట్ ఆర్థిక సేవల సంస్థలకు రిజర్వు బ్యాంక్ గట్టి షాకిచ్చింది. పీఎన్‌బీపై రూ.72 లక్షల జరిమానా విధించిన ఆర్బీఐ..ఫెడరల్ బ్యాంకుపై రూ.30 లక్షల జరిమానా విధించింది. అలాగే మెర్సిడెజ్-బెంజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌పై కూడా రూ.10 లక్షల జరిమానా వేసింది. పీఎన్‌బీ విషయానికి వస్తే అడ్వాన్స్‌లపై వడ్డీరేట్లు, ఖాతాదారులకు సరైన విధంగా సేవలు అందించకపోవడం వల్లనే జరిమానా విధించింది. కోసమట్టమ్ ఫైనాన్స్‌పై రూ.13.38 లక్షలు జరిమానా వేసింది.